# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త






## శ్రీవారి సేవలో సిఎస్ విజయానంద్



తిరుమల, జూలై 27ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ సిఎస్ విజయానంద్ దంపతులు దర్శించుకున్నారు. టిటిడి ఈఓశ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ,ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు సౌకర్యాలు కల్పన బావుందని అభినందించారు.

## తిరుమలకు కృష్ణాజలాలు

### -మంత్రి రామానాయుడు

తిరుమల, జూలై 27ప్రభాతవార్తప్రతినిధి: భక్తుల దాహార్తి తీర్చుడానికి శాశ్వత పరిష్కారంగా శ్రీశైలం నుండి కృష్ణా జలాలు తిరుమలకు తీసుకువస్తామని రాష్ట్రమంత్రి నిమ్మలరామానాయుడు తెలిపారు. నీవా కాలువద్వారా భవిష్యత్‌లో తిరుపతికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు అందిస్తామన్నారు. తిరుమల ఆధ్యాత్మికతను, పవిత్రతను కాపాడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో



కుటుంబసభ్యులతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. అదనపు ఈఓ చిరు మామిళ్ల వెంకయ్యచౌదరి తీర్థప్రసాదాలు అందజేశారు.

# నిర్లక్ష్యం... పసిగుడ్డు ప్రాణం తీసింది!



108 వాహనాన్ని తోస్తున్న స్థానికులు





108 వాహనం లోపల సీట్లు కూడా లేని దుస్థితి

## అత్యవసరానికి ఆదుకోని "108"

కేవీబీ పురం, జూలై 27 ప్రభాతవార్త: పురిటినొప్పులతో విలవిల్లాడిన గర్భవతిని సకాలంలో ఆస్పత్రికి తరలించడంలో అత్యవసర సేవ "108" అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో మహిళ కడుపులోనే పసిగుడ్డు ప్రాణం పోయింది. ఈ ఘటన ఆలస్యంగా సత్యవేడు నియోజకవర్గం కెవిబిపురం మండలంలో చోటుచేసుకుంది. తొమ్మిదినెలలు అమ్మతనానికి నోచుకుని చివరకు ప్రసవసమయంలో కష్టాలతో కడుపులోని పసిగుడ్డును పోగొట్టుకున్న ఆ తల్లి హృదయ విచార ఘటన జనం చర్చతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇదీ జిల్లా వైద్యఆరోగ్యశాఖ యంత్రాంగం వైఫల్యంగానీ, 108 అంబులెన్స్‌ల నిర్వహణ సిబ్బంది తప్పిదంగానీ ఊహించని చేదుఘటన జరిగిపోయింది. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీ పురం మండలం కళత్తూరు పంచాయతీ పరిధిలోని కొట్టాలమిట్ట గిరిజన కాలనీలో చెంచమ్మ ,నారాయణ కాపురముంటున్నారు. చెంచమ్మ నిండు గర్భిణీ కావడంతో గత ఆదివారం రాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. ఆమె కుటుంబ సభ్యులు ఆమెను తుఫాను సెంటర్‌నుంచి కాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆమెను తిరుపతి మెటర్నటి ఆస్పత్రికి తరలించడానికి 108 అంబులెన్స్ సాయం కోరారు. అయితే శ్రీకాళహస్తిలో వాహనం అందుబాటులో లేకపోవడంతో కేవీబీ పురం 108కు సమాచారం అందించారు. ఆ వాహనం అక్కడకు రావడానికి గంట సమయం పడుతుందని, అప్పటి వరకు వేచి చూడాలని ఆ సిబ్బంది సూచించారు. అయితే ఆదివారం అర్ధరాత్రి దాటినా 108 వాహనం రాకపోవడంతో మళ్లీ రాత్రి 1 గంటకు 108ని సంప్రదించారు. ఎట్టకేలకు 1.45 గంటలకు 108 అక్కడికి చేరుకోవడంతో అదే వాహనంలో తిరుపతికి తీసుకెళ్ళారు. తిరుపతి ప్రసూతి ఆస్పత్రి వైద్యులు అత్యవసర చికిత్స చేసి సాధారణ కాన్పులో ఆడ శిశువును వైద్యులు బయటికి తీశారు. అప్పటికే ఆ శిశువు మృతి చెందిందని తెలిపారు. తమ బిడ్డ మృతికి 108 వాహనం ఆలస్యం, కాళహస్తి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సకాలంలో 108 వాహనం వచ్చి ఉన్నా లేక కాళహస్తి ఏరియా ఆస్పత్రి వైద్యులు వైద్యం అందించి ఉన్నా తమకు కడుపుకోత ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు మారుమూల పల్లెల్లో గిరిజనజనానికి వైద్యసేవలు అందుబాటులోకి తీసుకు వచ్చేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### జిడినెల్లూరు 'దేశం'లో

# ఆరని చిచ్చు

## సర్దుబాటుకు రంగంలోకి జిల్లా పార్టీ అధ్యక్షుడు సిఆర్ రాజన్

చిత్తూరు, జులై 27 ప్రభాతవార్త: ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్‌కు, నియోజకవర్గం లోని ఓ వర్గం తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య రగలిన చిచ్చు ఇంకా ఒక కొలిక్కిరాలేదు. జిల్లా పార్టీ అధ్యక్షులు ఇరు వర్గాలను పత్రికలకు ఎక్కి ఆరోపణలు చేసుకోవద్దని కట్టడి చేయడంతో తాత్కాలికంగా సర్దుబాటు అయినట్లు కన్పిస్తున్నప్పటికీ ఇరు వర్గా లు మాత్రం ఒకరిపై ఒకరు లోలోపల కారాలు మిరియాలు నూరుకుంటున్నారు. ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్‌కు పార్టీలోని ఓ వర్గం నేతలు మొదటి నుండి సహకారం అందించడం లేదు. ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ సైతం వారిని పట్టించుకోకుండా తనకంటూ ఓ వర్గంను ఏర్పరచుకుని వారికి మాత్రమే అనుకూలంగా వుంటూ నియోజకవర్గంలో రాజకీయం చేస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేపై నేరుగా ఆరోపణలు చేయలేని ఎమ్మెల్యే వ్యతిరేక వర్గ నాయకులు కొంతమంది ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్‌ను టార్గెట్‌గా చేసుకుని ఆయన పిఎ చంద్రశేఖర్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ నేరుగా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సీరియస్ అయిన ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ ఎవ్వైనా ఆధారాలు వుంటే నిరూపించాలని ఫిర్యాదు చేసిన నేతలకు సవాల్ విసిరారు. ఈ క్రమంలో జిల్లా పార్టీ అధ్యకక్షులు సిఆర్ రాజన్ కల్పించుకుని ఇరు వర్గాలను హెచ్చరించి ఎవ్వరు పత్రికలకు ఎక్కవద్దని స్పష్టం చేశారు. ఈ విషయంపై జిల్లా పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్ ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులతో చర్చలు జరుపుతున్నారు. అయితే ఈ చర్చలు ఎంత మాత్రం ఫలితాలు ఇస్తాయనే విషయంపై నియోజకవర్గంలోని పార్టీ నాయకుల్లో చర్చ జరుగుతున్నది.

## గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్‌కు సాదర స్వాగతం



తిరుమల, జూలై 27 ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుపతి,తిరుమలకు చేరుకున్న రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ దంపతులకు ఆదివారం ఉదయం సాదర స్వాగతం లభించింది. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తిరుమలలో స్వాగతం పలికారు. అంతకుముందు ఉదయం తిరుపతి రైల్వేస్టేషన్‌లో తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ శుభంబన్సల్ జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, రైల్వే డిఎస్పీ హర్షితచంద్ర పుష్పగుచ్ఛాలతో సాదర స్వాగతం పలికారు.

## అద్భుతం...స్వామివారి అన్నప్రసాదం

### దాతల సహకారంతో పరంపర కొనసాగాలి -మాజీ ఉపరాష్ట్రపతి



తిరుమల, జూలై 27ప్రభాతవార్తప్రతినిధి: భక్తులతో కలసి భగవంతుని అన్నప్రసాదం స్వీకరించడం భగవత్ ప్రసాదంగా భావిస్తున్నట్లు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ పరంపర ఇలాగే కొనసాగుతుండాలని ఆయన ఆకాంక్షించారు. శ్రీవారిసేవకుల సేవలను అభినందించారు.అన్నప్రసాదం చాలా రుచిగా, నాణ్యతగా అద్భుతంగా ఉందని అభినందించారు.ఆదివారం మధ్యాహ్నం వెంగమాంబ అన్నప్రసాదభవనంలో అన్నప్రసాదం స్వీకరించారు.

## శివయ్యకు డైమండ్‌నెక్లస్ వితరణ



శ్రీకాళహస్తి, జూలై 27 ప్రభాతవార్త దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానానికి భక్తులు భూరి విరాళాలు అందిస్తున్నారు.ముఖ్యంగా అన్నదాన ట్రస్టు,జ్ఞాన ప్రసూనాంబ ఆభరణ ట్రస్టుకు భక్తుల నుంచి విరాళాలు అందిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆదివారం శ్రీకాళహస్తి పట్టణ వాస్తవ్యులు డి.శ్రీహరిశంకర్ అవదాని డి.పద్మావతి శివయ్యకు 0.90.680 గ్రాముల విలువ చేసే బంగారు డైమండ్ నెక్లెస్ ను ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డికి అందజేశారు.దీని విలువ సుమారు 12 లక్షల రూపాయిలు ఉంటుందని ఆలయ ఇఓ బాపిరెడ్డి తెలిపారు.వారికి ఆలయ మరాద్యాలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

## కాణిపాకం ఆలయానికి రూ.3 లక్షలు విరాళం



కాణిపాకం, జులై 27 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి పథకాలకు ఇద్దరు భక్తులు 3 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. శాశ్వత నిత్యన్నదాన పథకానికి తిరుపతికి చెందిన కృష్ణ మోహన్, పార్థసారధి నాయుడులు 2,01,116 రూపాయలను డిడి రూపలో విరాళంగా అందజేశారు. అలాగే బెంగళూరుకు చెందిన పుష్పలత, శివప్రసాద్ దంపతులు శ్రీ సిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 1,00,016 రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తంను దాతలు కుటుంబసభ్యులతో కలిసి ఆలయ సూపరిటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీలకు అందజేశారు.

# పేదల పక్షాన నిలిచేది ఎర్రజెండా

## దోపిడీ వ్యవస్థ ఉన్నంత కాలం కమ్యూనిస్ట్ అవసరం - సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి

గూడూరు, జూలై 27, ప్రభాతవార్త పేదల పక్షాన నిలిచేది ఎర్ర జెండా అని, దోపిడీ వ్యవస్థ ఉన్నంత కాలం కమ్యూనిస్ట్ అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో సీపీఐ గూడూరు నియోజకవర్గం 2వ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి సి.వి ఆర్ కుమార్, గుండాల రమేష్‌లు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళిలు పాల్గొన్నారు. ముందుగా గూడూరు సీపీఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయం నుండి టవర్ క్లాక్ మీదుగా రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ పేదల, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం సీపీఐ లక్ష్యం అన్నారు. వంద ఏళ్లుగా సీపీఐ పార్టీ ఎన్నో పోరాటాలు చేసి కార్మికులు, కర్షకులు, పేదల పట్ల నిలిచిందన్నారు. ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్ట్ లే అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ధరలు నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గవర్నర్‌ల వ్యవస్థతో ప్రజాస్వామ్యాన్ని కునిచేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ కార్మికుల హక్కులను కాలరస్తోందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను దగ చేస్తున్నాయన్నారు. ఈ



కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, ఏ ఐటియూసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర శేఖర్ రెడ్డి, రాధకృష్ణ, సీపీఐ నియోజవర్గ కార్యదర్శి శశి కుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా, ఏఐటియూసి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సి.వి ఆర్ కుమార్, బి.కె.ఎం.యూ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసామూర్తి, సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, జిల్లా నాయకులు మహేంద్ర, ఉదయ్, మున్సిపల్ వర్కర్స్ నాయకులు రాఘవయ్య, గోపి, ఆశా వర్కర్స్ ప్రసన్న, సునీల్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రేక్షకులను ఆకట్టుకున్న ధుర్యోధన వధ

రామచంద్రాపురం, జూలై 27 ప్రభాతవార్త: పరమాల, చుట్టుగుంట రామాపురంలో జరుగు తున్న మహాభారత ఉత్సవాలలో ఆదివారం ధుర్యోధన వధ నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నది. పరమాల మహాభారత ఉత్సవా లలో ధోర్యోధన వధ ఘట్టానికి ఉభయదా రులుగా లెక్కల జ్యోతి సురేంద్ర నాయుడు దంపతులు వ్యవహరించారు. భీమసేనుడుగా పదిట్లబైలు దొరస్వామి, ధుర్యోధనుడుగా కుమార్ నాటకాన్ని రక్తికట్టించారు. రామాపురం మహాభారత ఉత్సవానికి కొట్టే వెంకటాద్రి రెడ్డి కుమారులు ఉభయదారులుగా వ్యవహరించారు. ధుర్యోధనుడు ప్రాణభయంతో గంగమడుగులో దాక్కోవడం భీమసేనుడు తన రెచ్చగొట్టే వ్యాఖ్య లతో గంగమడుగు నుండి ధుర్యోధనుడిని వెలికి రప్పించడం ఆకట్టుకున్నది. అనంతరం భీమ ధుర్యోధనుడి మధ్య జరిగిన భీకర యుద్ధంలో



భీముడు తన గదాయుధంతో దుర్యోధనుడి తొడ విరగొట్టి సంహరించిన ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నది.

### భక్తిశ్రద్ధలతో అగ్నిగుంధ ప్రవేశం

ఆదివారం భక్తిశ్రద్ధలతో భక్తులు అగ్నిగుంధ ప్రవేశం చేశారు. ఉభయదారులుగా రామానాయుడు కండ్రిగకు చెందిన కోరా హరిప్రసాద్ దంపతులు వ్యవహరించారు. సి.రామాపురం మహాభారత ఉత్సవాలలో అగ్నిగుంధ ప్రవేశం ఉభయదారులుగా కొట్టే వెంకటాద్రిరెడ్డి కుమారులు వ్యవహరించారు. భక్తులు 7 బావులలో స్నానమాచరించి, వేపాకు చేతపట్టుకుని కంకణదారులై అగ్నిగుండం వద్దకు చేరుకున్నారు. గోవిందనామ స్మరణల నడుమ ద్రౌపది అమ్మవారిని అగ్నిగుండం వద్దకు తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి నిప్పుకణికలతో అమ్మవారికి వడిమాల కట్టారు. అనంతరం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

## నేడు అపోలో యూనివర్సిటీలో కనెక్టోమిక్స్-2025 జాతీయ సదస్సు

### - దేశవిదేశాల నుండి హాజరుకానున్న నిపుణులు

చిత్తూరు, జులై 27 ప్రభాతవార్త: ఆధునిక వైద్యరంగంలో ఓమిక్స్, బయోఇన్ఫర్మేటిక్స్ వంటి విభాగాలు తీసుకువస్తున్న విప్లవాత్మక పరిణామాలపై చర్చించడానికి సోమవారం నుండి అపోలో యూనివర్సిటీలో కనెక్టోమిక్స్-2025 బ్రిడ్జింగ్ మెడిసన్ అండ్ బైట్స్ జాతీయ సదస్సు ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో జరుగనున్న ఈ సదస్సు సోమవారం ప్రీకాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌తో ప్రారంభం కానుంది. ప్రధాన సదస్సు మంగళ, బుధవారాల్లో జరుగనుంది. ఈ సదస్సుకు దేశ వ్యాప్తంగా వున్న వైద్య నిపుణులు, శాస్త్రవేత్తలు, బయోఇన్ఫర్మేటిక్స్ పరిశోధకులు హాజరు కానున్నారు. ఈ సదస్సులో జినోమిక్స్, ప్రోటోమిక్స్, సిస్టమ్స్ బయాలజీ, మైక్రోబయోమ్, మెటబోలొమిక్స్, ఫార్మకోజెనొమిక్స్ వంటి అంశాలపై ప్రత్యేక సెషన్లు జరుగనున్నాయి. విద్యార్థులు, యువ పరిశోధకుల కోసం పోస్టర్, ఒరల్ ప్రెజెంటేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎంపికైన శిక్షణార్థులకు ప్రీకాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌లో ప్రాక్టికల్ శిక్షణను అందించనున్నారు.

## కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది : ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి విద్య జూలై 27 ప్రభాత వార్త కళలు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు కళలను, క్రీడలను అదనంగా నెర్పించేందుకు తల్లితండ్రులు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. అభినయ ఆర్ట్స్ రజితోత్స వేడుకల్లో చివరి రోజైన ఆదివారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అర్ధనారీశ్వరం నృత్య రూపకాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిలకించారు. నృత్యరూపకంలో పాల్గొన్న చిన్నారులకు ప్రదర్శనా జ్ఞాపికలను ఆయన అందచేశారు. 25 ఏళ్ళుగా కళలను ప్రోత్సాహిస్తూ అన్ని రకాల నాటికలు, నృత్య, జానపద పోటీలు నిర్వహిస్తున్న అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బిఎన్ రెడ్డి కృషిని అభినందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. కళలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రోత్సాహిస్తున్నదని ఆయన చెప్పారు. తల్లితండ్రులు తమ పిల్లలను కేవలం విద్యకే పరిమితం చేయకుండా కళలు, క్రీడల వైపు ప్రోత్సాహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు వరప్రసాద్,కోదండ, కూరపాటి సురేష్, అభినయ ఆర్ట్స్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అమృత పథకంలో రూ.268కోట్లతో ప్రతిపాదనలు



## ఎమ్మెల్యే బొజ్జల వెంకటసధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 27 ప్రభాతవార్త శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో అమృతపథకంలో నిధుల సాధనకు ప్రతిపాదించినట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసధీర్‌రెడ్డి వివరించారు. ఆదివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంను అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా మున్సిపల్ పరిధిలో అభివృద్ధి చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. తన తండ్రి హయాంలోనూ 'అమృత పథకంలో' నిధులు సాదించారన్నారు. అప్పటిలో అయ్యల నాడు చెరువువాకింగ్ ట్రాక్, పిల్లల పార్కు,బోట్ క్లబ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. అలాగే పట్టణంలోని మురుగునీటి ఊరవతలకు తరలించి అక్కడ శుద్ధి చేసి పంట పొలాలకు వాడేందుకు నిధులు సాధించినట్లు తెలిపారు.కానీ ఐదేళ్ళ పాలనలో వైకాపానాయకుడు పట్టించుకోలేదు.దాంతో నిధులు వెనక్కువెళ్ళాయని ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి వివరించారు.

### అమృతపథకంలో రూ.268కోట్లకు ప్రతిపాదనలు:

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పురాతన కాలం నాటి పైప్‌లైన్లు, కాలువలు నేటి అవసరాలను తీర్చలేకున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.అందుకే కేంద్ర మంత్రితో చర్చించి 'అమృతపథకం'లో నిధుల మంజూరుకు రూ.268 కోట్లతో పథకం రూపొందించినట్లు దానిని సమర్పించినట్లు వివరించారు. ఇందులో నేటి సాంకేతిక పరిజ్ఞానంతో అండ్ గ్రౌండ్ మురుగునీటి కాలువలు, విద్యుత్ వైర్లు,అలాగే మంచినీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అలాగే శ్రీకాళహస్తి నియోజకవర్గం తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో ఉంది. కాబట్టి ఆ చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డితో కలసి చర్చించామని క్షేత్రస్థాయిలో ఆయనకు అవగాహన కల్పించుటకు 'ఏ డే విత్ తుడా చైర్మెన్' కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ముఖ్యంగా తుడా నిధులతో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి, పార్కులు, అవకాశం ఉన్న చోట గ్రీనరి చేపట్టుటకు ప్రతిపాదించినట్లు వివరించారు. మొదటిగారూ.5కోట్లు ఇవ్వటానికి తుడా చైర్మెన్ భరోసా ఇచ్చారన్నారు.శ్రీకాళహస్తిలో అక్రమణల తొలగింపుకు సంబంధించి పక్కాగా సమాచారంతో ముందడుగు వేయనున్నట్లు తెలిపారు.

## రెండోరోజు ఎర్రబ్యాడ్జీలతో నిరసన



**కుప్పం, జూలై 27 ప్రభాతవార్త** రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కుప్పంలో ఆర్టీసీ ఎన్ఎంయుఎ నేతలు, ఉద్యో గులు రెండో రోజు ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కడప జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రహంతుల్లా, డిపో అధ్యక్షుడు మునస్వామి, ఎడిసి వెంకటయ్య, డిపో కార్యదరి ్శ జయపాల్, జాయి ంట్ కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ విజయవాడ, గవర్నర్‌పేట 1, పాత బస్టాండు స్థలాలను లులూ షాపింగ్ మాల్, ప్రైవేట్ వ్యక్తులకు ప్రభుత్వం అప్పగించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిపో నేతలు దిలీప్‌కుమార్, జయశంకర్, మొగిలీశ్వర్, అరుణ్ పాల్గొన్నారు.

## ఉచిత శస్త్రచికిత్సలకు 25 మంది ఎంపిక

**కుప్పంరూరల్, జూలై27 ప్రభాతవార్త**



కుప్పం బిఆర్‌డి ఆస్పత్రిలో ఆదివారం లయన్స్‌క్లబ్, బ్రెయిన్స్ హాస్పిటల్, ఆల్టియస్ ఆస్పత్రి బెంగళూరు వారిచే నిర్వహించిన ఉచిత గుండె, నరాల సంబంధిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు రెండు వందల మంది శిబిరంకు హాజరు కాగా వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచిత ఆపరేషన్లకు 25మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో బిఆర్‌డి ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, లయన్స్‌క్లబ్ సలహాదారుమహేష్, డా॥ హరికిరణ్, డా॥ నితిన్, సభ్యులు పిజి సెల్వం, సెంధిల్‌కుమార్, శివప్రసాద్, చరణ్, ప్రసాద్, కృష్ణమూర్తి, వరదరాజులు, పిఆర్వోలు రాజ్‌కుమార్, పురుషోత్తం, మణి పాల్గొన్నారు.

## శ్రీ బాలమురుగన్ ఆలయానికి రూ.50వేల విరాళం

**రామకుప్పం, జూలై 27 ప్రభాతవార్త**



మండలంలోని పాలరేవు గడ్డ వద్దగల శ్రీ బాలమురుగన్ ఆలయానికి యూనిట్ ఇన్‌చార్జ్ గంట్లప్పగౌడు, మండల తెలుగుయువత అధ్యక్షుడు విశ్వనాథ్‌లు పాతికవేలు, పిఎసిఎస్ ఛైర్మన్ మహ్మద్ రఫీ పాతికవేల విరాళాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత పత్ర నారాయణ, నేతలు జయశంకర్, గిరిదాసు పాల్గొన్నారు.

## ఐరన్‌షాపులో షార్ట్ సర్క్యూట్.. రూ.లక్ష దాకా నష్టం

**రామకుప్పం, జూలై 27 ప్రభాతవార్త**



స్థానికంగా ఉన్న ఓ ఐరన్‌షాప్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా లక్షన్నర రూపాయల దాకా నష్టం సంభవించింది. బాబు, సావి త్రమ్మలు కులవృత్తి రీత్యా దుస్తులు ఉతికి ఐరన్ షాపు నిర్వహించుకునేవారు. శనివారం సాయంత్రం పని ముగిశాక స్వగ్రామం ముద్దనపల్లికి వెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చి చేసేసరికి 38 కుటుంబాలకు చెందిన దుస్తులు, ఐరన్ మిషన్, పట్టుచీరలు, ఇతర సామగ్రి కాలిపోయి ఉన్నాయి. దాదాపు ఒకటిన్నర లక్ష దాకా నష్టం కలిగిందని తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

**వి.కోట, జూలై 27 ప్రభాతవార్త**



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని చింతమాకులపల్లి పంచాయతీ కుదవగడ్డకు చెందిన పెరుమాళ్ ('35) ఇతని సమీప బంధువు కృష్ణగిరి సమీపంలోని బరుగూరుకు చెందిన విజయ్ (35)లు టువీలర్‌లో స్వగ్రామం నుంచి వి.కోటకు వచ్చి అతిగా మద్యం సేవించారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ఒగు గ్రామం వద్ద కారును ఢీకొన్నారు. దీంతో పెరుమాళ్, విజయ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో తొలుత వి.కోట ఆస్పత్రి అనంతరం కుప్పంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పిల్లిగుండ్లపల్లిలో ఇన్‌ఛార్జీ మంత్రి

**శ్రీరంగరాజపురం, జులై 27 ప్రభాతవార్త:**

శ్రీరంగరాజపురం మండలం పిల్లిగుండ్లపల్లికి ఆదివారం జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి విచ్చేశారు. మండలానికి చెందిన తెలుగుదేశం నాయకులు త్యాగరాజునాయుడు స్వగృహంలో జరిగిన కేశఖండన కార్యక్రమానికి ఇన్‌ఛార్జీ మంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా తెలుగుదేశం అధ్యక్షులు సిఆర్ రాజన్‌తో పాటు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక రాజకీయాలపై చర్చ జరిగింది.స్థానిక తెలుగుదేశం నాయ కులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత

**చిత్తూరు, జులై 27 ప్రభాతవార్త:**

ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అని భావించి తక్షణం ఉపశమన ర్యలు చేపట్టాలని రాష్ట్రోపాధ్యాయ సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్ డిమాండ్ చేశారు. జిల్లా ఎస్టీయు కార్యాలయంలో ఆదివారం ఎస్టీయు కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గంటామోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల్లో ప్రభుత్వం ముంచుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కరవు భత్యం బకాయిలు విడుదల చేయాలని, వేతన సవరణ కమిటీ ఛైర్మన్‌ను సత్వరం నియమించాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యమం కచ్చితంగా వుండేలా అమలు చేయాలని కోరారు. వివిధ రకాల యాప్‌లు, ప్రొఫార్మల అప్‌లోడ్ చేయడానికి బోధనా సమయం హరించుకుపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పదవి విరమణ చెందిన వారు ఆర్థిక ప్రయోజనాలు అందక ఆందోళన చెందుతున్నారని, 2003 డిఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ విధానం వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎస్టీయు నాయకులు మాట్లాడుతూ సర్దుబాట్లు, బదిలీల కారణంగా స్థానచలనం పొందిన టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు దేవరాజురెడ్డి, చిట్టిబాబు, బొబ్బిలి, సుబ్రమణ్యం, లక్ష్మీపతి, ఫల్గుణ, మునిరాజు, ఆనందయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు - కడ పి.డి. వికాస్ మర్మత్

**కుప్పం, జూలై 27 ప్రభాతవార్త**

కుప్పం నియోజకవర్గ స్థాయిలో ప్రతి సోమవారం కుప్పంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను ఈనెల 28వతేది సోమవారం అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.



## మేళాగారంకు ఘన సన్మానం

**తొట్టంబేడు, జూలై 27 ప్రభాతవార్త**

బిజెపి జిల్లా ఉపాధ్యక్షులుగా మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి ఎన్నికైన సందర్భంగా ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యదర్శి, కన్వీనర్ కోలా ఆనంద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డిపార్టీ ఆవిర్భావం నుండి పార్టీకి ఎనలేని కృషి చేస్తున్నారని, ఆయన ఏర్పేడు, రేణిగుంట, శ్రీకాళహస్తి మండలాలకు పార్టీ ఇన్‌చార్జిగానే కాకుండా పార్టీ అసెంబ్లీకో కన్వీనర్‌గా, జిల్లా కార్యదర్శిగా పని చేసారన్నారు. అదేవిధంగా విద్యాభ్యాసం కాలంలో కూడా రాష్ట్రీయ స్వయం సేవక్ ఏబివిపిలోనూ చురుగ్గా పనిచేశారని, అలాంటి వ్యక్తికి మరోసారి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నుకోవడం ఆనందంగా వుందన్నారు. నూతనంగా ఎన్నికైన మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం, దేశ పరిరక్షణ కోసమే పుట్టిన పార్టీ అయిన బిజెపి పార్టీలో పని చేయడం నా పూర్వజన్మ సుకృతమన్నారు. బిజెపి పార్టీ అధ్యక్షులు సి. శ్రీనివాస్‌కు ఈ మేరకు కృతజ్ఞతలు తెలిపారు.

## భాస్కర్ నాయుడు సేవలు చిరస్మరణీయం

**: టిడిపి జిల్లా అధ్యక్షులు సిఆర్.రాజన్**



**వెదురుకుప్పం, జూలై 27 ప్రభాతవార్త :**

తెలుగు దేశం పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని టిడిపి జిల్లా అధ్యక్షులు సిఆర్.రాజన్ పేర్కొన్నారు. మండలంలోని గొడుగుచింత గ్రామంలో ఆ పార్టీ మాజీ మండల ఉపాధ్యక్షులుగా పనిచేసి ఎనలేని సేవలు అందజేసిన భాస్కర్ నాయుడు ఆకస్మికంగా మృతి చెందడం తెలిసి కర్మక్రియలకు హాజరైన్నారు. సందర్భంగా ఆయన చిత్ర పటంకు పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించి, మాట్లాడుతూ పార్టీకి ఆయనలేని లోటు తీర్చలేనిదని పేర్కొన్నారు. కుమారుడు కిరణ్‌తో ధైర్యంగా ఉండాలని పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల క్లష్టర్ ఇన్‌చార్జీ మోహన్ మురళి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి మునిచంద్రా రెడ్డి, నియోజకవర్గం టిఎన్‌టిసి అధ్యక్షులు గాలి బాబు నాయుడు, నాయకులు వెంకటాద్రి నాయుడు, చొక్కా మహేష్, మనోహర్ నాయుడు, వర్మచ మధు, సునీల్ నవీన్ నాయుడు, మోహన్, దాము, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన పథకానికి రూ. 25వేలు విరాళం

**బోయకొండ(చౌడేపల్లి), జూలై 27 ప్రభాతవార్త**



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో అమలు అవుతున్న అన్నదాన పథకానికి దాత విరాళానాన్నందించారు. కొండపై ఇట, ఉపకమీషనర్ ఏకాంబరంకు బెంగళూరుకు చెందిన వెంకటేశ్వర్లు, అరుణలు రూ. 25వేలు, అదే విధంగా అమృత, ఆర్యన్‌రాజు గోసంరక్షణకు రూ. 5వేలనందించారు. దాతలకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. ఆలయ అర్చక, అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

## అంకాలమ్మ ఆలయంలో శ్రావణం పూజలు

**చౌడేపల్లి, జూలై 27 ప్రభాతవార్త**



మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ గాండ్లపల్లిలో గల అంకాలమ్మ ఆలయంలో శ్రావణ ఆదివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ప్రధానార్చకుడి ఆధ్వర్యంలో అమ్మవారికి వివిధ జలాలు, పుష్పాలతో అభిషేకించాడు. రంగు రంగుల పూలతో అమ్మవారిని ఆల యాన్ని అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు పలు ప్రాంతాలనుంచిఅధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అంకాలమ్మకు పూజలు చేసుకొన్నారు. ముఖ్యంగా పుష్పమడిగేందుకు భక్తులు బారుల తీరారు.

## లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం

**సదుం, జూలై 27, ప్రభాతవార్త**



సదుం మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా విశ్రాంత ఉపాధ్యాయుడు కే సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సుబ్రమణ్య స్వామి ఆలయం ఆవరణలో జరిగిన లైన్స్ క్లబ్ సమావేశంలో కార్యదర్శిగా ఆర్ సహదేవయ్య కోశాధికారిగా కె నాగరాజులు ఎన్నికయ్యారు. అదేవిధంగా మెంబర్షిప్ ఛైర్ పర్సన్‌గా డాక్టర్ రమణారెడ్డి, సర్వీస్ ఛైర్పర్సన్ గా జి మల్లయ్య, మార్కెటింగ్ ఛైర్పర్సన్‌గా ధన శేఖర్, కోఆర్డినేటర్‌గా రెడ్డి నరసింహులు, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా డాక్టర్ కే రాజారెడ్డి, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్‌గా ప్రేమ్ కుమార్ రెడ్డి ఎన్నికయ్యారు. వీరితోపాటు డైరెక్టర్లుగా ఏడు మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, లయన్స్ క్లబ్ ఇన్సలేషన్ ఆఫీసర్ విజయభాస్కర్ రెడ్డి, రీజినల్ ఛైర్పర్సన్ రామయ్య, మనోజ్ కుమార్ రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భిక్షాటన చేస్తున్న వృద్ధురాలు మృతి

**పెద్దపంజాణి, జూలై 27 ప్రభాతవార్త:**



ఇళ్ళువదిలి వచ్చేసి 30ఏళ్ళుగా బిక్షాటన చేసుకుంటూ జీవనం గడుపుతున్న ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా..పలమనేరు పట్టణంలోని కంశలవీధికి చెందిన లేట్ రామక్రిష్ణ భార్య ఎం.సెల్వి(70) గతంలో పలమనేరులో నివాసం ఉండేది అయితే 30ఏళ్ళ క్రితమే ఆమె ఇంటినుండి వచ్చేసి అక్కడక్కడా భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించేది.ఈ నేపథ్యంలో ఇటీవలే పెద్దపంజాణి మండలానికి ఆమెవచ్చి స్థానికంగా భిక్షాటన చేస్తూ ఉండేది. అయితే ఏమి జరిగిందో తెలియదుగానీ ఆదివారం పెద్దపంజాణి బస్‌స్టాండ్‌లో వృద్ధురాలు మృతిచెందిఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు మృతురాలి కుమారుడు వెంకటేష్‌కు సమాచారం అందించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రాక్టికల్ శిక్షణతో నైపుణ్యాల్లో మెరుగుదల

**- ముగిసిన అపోలో నర్సింగ్ వర్క్‌షాప్**

**చిత్తూరు, జులై 27 ప్రభాతవార్త:**

ఆపరేషన్ థియేటర్లలో శస్త్రచికిత్సల సమయాల్లో అవసరమయ్యే కీలక నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చిత్తూరు అపోలో యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆపరేషన్ థియేటర్ నర్సింగ్ వర్క్‌షాప్ ఆదివారం విజయవంతంగా ముగిసింది. అపోలో యూనివర్సిటీలోని అపోలో నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి 616 నర్సింగ్ విద్యార్థినిలు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎపిఎన్ఎంసి పరిశీలకులు, కడప ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శశికళ మాట్లాడుతూ ఈ శిక్షణ జరిగిన రెండు రోజుల పాటు నర్సింగ్ విద్యార్థినిలు శాస్త్రీయంగా, ప్రాక్టికల్‌గా శిక్షణ పొందారని, ఆపరేషన్ థియేటర్‌లో శస్త్ర చికిత్స విజయానికి ఓటి నర్సుల పాత్ర ఎంత కీలకమో వారు ప్రత్యక్షంగా అర్థం చేసుకున్నారన్నారు. అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.జయంతి మాట్లాడుతూ విద్యార్థులకు ఓటి సెటప్, స్టెరిలైజేషన్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, ఇన్‌స్ట్రుమెంట్స్ హ్యాండ్లింగ్, ప్రీపోస్ట్ ఆపరేటివ్ కేర్ వంటి అంశాలపై లైవ్ సెషన్లు, ప్రాక్టికల్ డెమోలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆసుపత్రుల్లో వాస్తవ పరిస్థితులను అనుగుణంగా నర్సింగ్ విద్యార్థినిలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, జులై 27 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు అందరు తప్పక హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. అలాగే డివిజన్ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సైతం అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కర వేదిక కార్యక్రమం నిర్వహించి అక్కడి ప్రజల నుండి అందిన సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు.

## కాళిగానూరులో సుపరిపాలనలో తొలిఅడుగు

**శాంతిపురం, జూలై 27 ప్రభాతవార్త**



మండలంలోని కడపల్లి పంచాయతీ కాళిగానూరు గ్రామంలో ఆదివారం కడ పిఎసి సభ్యురాలు సుగుణమ్మ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార క్రమాలు వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో నేతలు దొరస్వామి, బాలకృష్ణ, తిమ్మప్ప, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నెల్లిమంద పాలేటి గంగమ్మ జాతరకు శ్రీకారం

**సోమల, జూలై 27, ప్రభాతవార్త**



నెల్లిమంద సమీపంలో వెలసిన గ్రామ దేవత పాలేటి గంగమ్మ జాతరకు ఆదివారం శ్రీకారం చుట్టారు. పంచాయతీలోని ఎగువపల్లిలో ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులకి అమ్మవారిని ఆలయం నుంచి వెలుగు తీసుకువచ్చారు. నేటి నుంచి వారం రోజులు పాటు అమ్మవారిని వివిధ గ్రామాల్లో ఉదయించి శనివారం ఉదయానికి ఆలయంలోకి తీసుకొస్తారు. ఆది సోమవారాలలో జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సాకిబండ నరసింహులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్య నిర్వాహకులు తెలిపారు.

## ప్రొబేషనరీ ఎస్సైగా రమేష్



**పుంగనూరు రూరల్, జూలై 27, ప్రభాతవార్త** పట్టణ పోలీస్ స్టేషన్‌లో ప్రొబేషనరీ ఎస్సైగా ఎన్. రమేష్ ఆదివారంవిధుల్లోచేరారు.ఈసందర్భంగాఆయనసీఐ సుబ్బారాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పోలీస్ ఉన్నతాధికారుల సూచనలు, సహచరుల సహకారం అందుకుంటూ ప్రజాసేవలో ముందుండేలా పని చేస్తానన్నారు. ప్రజల సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానని తెలిపారు.

## మాతృదేశ రుణం తీర్చుకున్న కలాం

**పుంగనూరు రూరల్, జూలై 27, ప్రభాతవార్త**



అబ్దుల్ కలాం మాతృదేశ రుణం తీర్చుకున్న గొప్ప దేశభక్తుడని పలువురు కొనియాడారు.ఆదివారం పట్టణంలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు అబ్దుల్ కలాం ట్రస్ట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జీవిత విశేషాలను స్మరించుకున్నారు. కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, తద్వారా వచ్చిన మార్గదర్శనం తరతరాలకు స్ఫూర్తిదాయకమని పలువురు అన్నారు. ఈ వేడుకలో సీఐ సుబ్బారాయుడు పాల్గొని, కలాం జీవితం నుండి యువత నేర్చుకోవాల్సిన అంశాలను వివరించారు. నాయకుడు అయూబ్ ఖాన్ మాట్లాడుతూ, శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా కలాం భారత గౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానుభావుడని కొనియాడారు.

## రక్షణకు కరాటే ఎంతో అవసరం

**పుంగనూరు, జులై 27, ప్రభాతవార్త**



నేటి కాలంలో ఎదురయ్యే దాడులు, కుట్రపూరిత భౌతిక దాడులనుంచి రక్షించుకోవడానికి కరాటే ఎంతో అవసరమని సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారాయుడు అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో మహేష్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పుంగనూరు పట్టణంలో పరిసర గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చి కరాంటు నేర్చుకునేందుకు అనువైన కేంద్రం ఏర్పడడం ఎంతో సౌకర్యవంతమన్నారు. కరాటే మాస్టర్ రెడ్డి మహేష్ మాట్లాడుతూ విద్యార్థులకు కరాటే నేర్పించడానికి నిష్ణాతులైన మాస్టర్లు ఉన్నారన్నారు. రోటర్ క్లబ్ ప్రెసిడెండ్ నానబల గణేష్ , అనిల్, కరాటే అసోసియేష్ ఆఫ్ ఆంధ్రా ప్రదేశ్ జాయింట్ సెక్రటరీ సభ్యులు పాల్గొన్నారు.



## కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్‌గా మణికంఠ

**పుంగనూరు, జులై 27, ప్రభాతవార్త**

సర్వశిక్షాఅభియాన్ ఆధ్వర్యంలో ప్రభుత్వఉన్నత పాఠశాలల కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ గా పుంగనూరు మణికంఠ కామాటం నియమించబడ్డారు. జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పదవ తరగతి తర్వాత చదవాల్సిన ఉన్నత విద్య గురించి, ఏపి ఉన్నత చదువులు చదివితే మంచి భవిష్యత్తు లభిస్తుంది. ఉద్యోగ అవకాశాల గురించి అవగాహన కల్పించేందుకు ఆయన సేవలు వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది. దీంతో పాటు విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించెందుకు జిల్లా ఏ విద్యా శేఖర్ మణికంఠ సేవలు తీసుకోనుంది. అయితే జిల్లా నుంచి ఏ విద్యా సంస్థలైనా, పాఠశాల సెలవు రోజుల్లో ఉచిత కెరీర్ గైడెన్స్, మెంటల్ కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ తన వద్ద నుంచి సలహాలు తీసుకోవచ్చని మణికంఠ తెలిపారు.

## స్వచ్ఛ భారత్‌తో పరిసరాల శుభ్రత

**వెదురుకుప్పం, జూలై 27 ప్రభాతవార్త :**

స్వచ్ఛ భారత్‌తో పరిసరాల పరిశుభ్రత,మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాన్‌కీ బాత్ కార్యక్రమంలో పేర్కొన్నట్లు జిల్లా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రి తెలిపారు. మండలంలోని తెల్లగుండ్లపల్లె బూత్ నంబర్ 79లో ఆదివారం ప్రధానమంత్రి నిర్వహించిన మాన్‌కీ బాత్ కార్యక్రమం వీక్షించారు. ఈ సందర్భంగా క్రీడల ప్రాధాన్యత క్రీడకారుల గురించి వివరించారు. స్వచ్ఛ భారత్ అలహాబాద్ బ్రిడ్జి పై పరిశుభ్రత గురించి చెప్పారు. నాగపంచమి, రక్షాబంధన్ శ్రీకృష్ణ జన్మాష్టమి గురించి తెలిపారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు సుధాకర్, స్థానికులు నాగార్జున, మురగయ్య, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

## కాపులకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలి

**వెదురుకుప్పం, జూలై 27 ప్రభాతవార్త :**



కాపులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని ఆర్‌పిఎఫ్ వ్యవస్థాపకులు రెడ్డి శేఖర్ రాయల్ డిమాండ్ చేశారు. మండలంలోని పచ్చికాపల్లంలో ఆర్‌పిఎఫ్ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముందుగా శ్రీకృష్ణా దేవరాయుల చిత్ర పటంకు పూలమాల వేసి నినాధలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బలిజ కులం వారికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వడంతో పాటు వారికి రాయితీలు అందించి అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. మనం అందరు సమిష్టిగా మన హక్కుల సాధనకు ఐక్యతతో పోరాటం చేయాలని చూచించారు. ఐక్యతతో మనకు గుర్తింపు, హక్కులు సాధించుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపి రాయల్, శ్రీరామ్ గోపి రాయల్, గంగాధర నెల్లూరు ఇన్‌చార్జీ ప్రసాద్ రాయల్, వెదురుకుప్పం మండల అధ్యక్షులు భాస్కర్ రాయల్, కమిటీ సభ్యులు షణ్ముగం రాయల్, దేవరాజు రాయల్ పాల్గొన్నారు.

## ఉచిత కంటిఆపరేషన్లకు 29మంది ఎంపిక



**కుప్పం, జూలై 27 ప్రభాతవార్త** కుప్పంసాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శారద కంటి ఆస్పత్రి వారిచే ఆదివారం బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం తొంభైమందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో ఇరవై తొమ్మిది మందిని ఉచిత క ంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. సిబ్బంది బాబు, విజయ, కాంచన, ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు పాల్గొన్నారు.

---

## నేడు చియ్యవరంలో తొలిఅడుగు . . .

**తొట్టంబేడు, జూలై 27 ప్రభాతవార్త**

తొట్టంబేడు మండలం చియ్యవరంలో సోమవారం సుపరిపాలన తొలిఅడుగు ఏర్పాటు చేసినట్లు పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు తెలిపారు.ఈ కార్యక్రమాలకు బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషిత హాజరు కానున్నట్లు ఆచప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏదైనా సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఆ మేరకు చియ్యవరంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రపార్లమెంట్ నియోజకవర్గం మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పాల్గొనవలసినదిగా ఆయన కోరారు. ఆ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## పుత్తూరులో ఆకట్టుకుంటున్న మహాభారతం

**పుత్తూరు రూరల్, జూలై 27 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి వార్షిక (బ్రహ్మోత్సవాల) సందర్భంగానిర్వహించిన మహాభారత హరికథ కాలాక్షేపం భక్తులను అమితంగా ఆకట్టుకుంటుంది. హరికథ వి.శారద, హరికథ డిప్లమా హరికథ ప్రవీణ, సంపూర్ణ మహా భారత రామాయణ కథకురాలైన పి.స్వర్ణలత భాగవతారణి హరికథ గానం వినిపించారు. పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుంచి పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు హరికథ వినడానికి అధిక సంఖ్యలో హాజరయ్యారు. హరికథ ప్రవచనాలు ఆగస్టు 11వ తేదీ వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఉంటుందని కోవిల్ కార్ సాల్వాకం కిష్టప్ప మొదలి తెలిపారు.

## తడుకు గ్రామ పంచాయతీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం



**పుత్తూరు రూరల్, జూలై 27 ప్రభాతవార్త:** నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు పుత్తూరు రూరల్ మండల క్లస్టర్ ఇన్‌చార్జి గంజిమాధవయ్య ఆధ్వర్యంలో పుత్తూరు రూరల్, మండలం తడుకు గ్రామ పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. బూత్ నెం.37, సీఎన్ కండ్రిగగ, మజ్జిగగుంట డోర్ టు డోర్ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్, మండల పార్టీ అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి హేమంత్, యూనిట్ ఇన్‌చార్జి ఆదిమండడి, తడుకు సర్పంచ్ వెంకటేష్, బూత్ ఇన్‌చార్జిలు లోకేష్, చిరంజీవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ ఉచిత శాశ్వత సభ్యత్వాన్ని సద్వినియోగం చేసుకోండి

**తిరుపతి హెల్త్, జూలై 27 ప్రభాతవార్త :**



తిరుపతి కరకంబాడి రోడ్డు వినాయక సాగర్ నందు నూతనంగా ఏర్పడిన వినాయక సాగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 గంటలకు ఉచితంగా వాకర్స్ సభ్యులకు గుర్తింపు కార్డులను వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ చేతులు మీదుగా అందజేశారు. ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవలో భాగంగా వినాయక సాగర్ వాకర్స్ క్లబ్ కార్యవర్గం నూతనంగా క్లబ్‌లో ఎటువంటి రుసుము లేకుండా సభ్యులకు ఉచితంగా సభ్యత్వం, గుర్తింపు కార్డులను జారి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 350 మంది సభ్యులకు చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, వినాయక సాగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు, ఉపాధ్యక్షురాలు శాంతి నాడార్, కార్యదర్శి లాయర్ చంద్ర, కోశాధికారి రామసుబ్బారెడ్డి, విజయకుమార్, రాజు, రాము, హరి, రమేష్, నరసింహారెడ్డి, వరలక్ష్మి, శాంతి, నాగలక్ష్మి, రోజా, తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్‌ని కలిసిన ఎస్వీయూ ఉన్నతాధికారులు

**తిరుపతి విద్య జూలై 27 ప్రభాత వార్త:**



తిరుపతి పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇన్చార్జ్ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వర్సిటీలో బోధన,పరిశోధన రంగాలకు సంబంధించిన ప్రగతిని గవర్నర్ కు వివరించారు.అనంతరం గవర్నర్ స్పందిస్తూ ఎస్వీయూ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి గవర్నర్ కార్యాలయం నుంచి ఎల్లవేళలా పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటుగా వారికి ఉపాధి అవకాశాలు కల్పన కోసం పూర్తిస్థాయిలో కృషి చేయాలని వీసీ, రిజిస్ట్రార్ లకు గవర్నర్ సూచించారు.



**విజయవాడలో జరిగిన టైక్వాండ్‌లో పోటీల్లో తిరుపతి టీం నుంచి గోల్డ్ మెడల్ సాధించిన క్రీడా కారుడు యార్లపల్లి జయదేవ్**

*తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త :*

**ప్రధాని మోదీ నిర్దేశం ప్రజలకు సంక్షేమం**

**మన్‌కీబాత్‌లో తిరుపతి బిజెపి నేతలు**

*ప్రభాతవార్త-తిరుపతి*



## రోడ్డు ప్రమాదంలో ఆర్టీసి డ్రైవర్ మృతి!



నాయుడుపేట, జులై 27 ప్రభాతవార్త: ఓజిలి మండలంలోని రాజుపాళెం దగ్గర జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసి డ్రైవర్ కొండూరు బాలరాజు (55) అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసుల సమాచారం మేరకు ఓజిలి మండలం చిలమానుచేను గ్రామానికి చెందిన కొండూరు బాలరాజు స్వగ్రామం నుండి మోటార్ సైకిల్‌పై గూడూరుకు వెళ్ళుతుండగా మార్గమధ్యలో రాజుపాళెం వద్దకు వచ్చేసరికి వెనుక నుండి అదే మార్గంలో అతివేగంగా వస్తున్న కారు, లారీని ఓవర్‌టేక్ చేయబోయి ప్రమాదవశాత్తు ముందుగా వెళుతున్న మోటార్ సైకిల్‌ను ఢీకొంది. దీంతో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న బాలరాజు అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకొన్న ఓజిలి ఎస్సై శ్రీకాంత్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలంకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పంచనామ నిమిత్తం మృత దేహాన్ని అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# గూడూరు డివిజన్

## అంగరంగ వైభవంగా శ్రీ మలక వేమాలమ్మ జాతర



దొరవారిసత్రం,జులై 27 ప్రభాతవార్త: దొరవారిసత్రం మండల పరిధిలోని అక్కరపాక గ్రామంలో వెలసిన శ్రీ మలక వేమాలమ్మ జాతర అంగరంగ వైభవంగా ఆదివారం ఏర్పాటు చేశారు. నూతనంగా ఆలయం నిర్మించి పూజలు నిర్వహించారు. అనంతరం అక్కరపాక పోలిరెడ్డి పాలెం గొల్లపాలెం ముత్తరాశి పాలెం శక్తి ఆదిపరాశక్తి అయిన శ్రీ మలక వేమాలమ్మ తల్లి జాతర మూడు రోజులపాటు ఘనంగా చేశారు. సూళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీనివాసులురెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రమణారెడ్డి,ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సురేష్ రెడ్డి, బాబు నాయుడు, రామచంద్ర నాయుడు, జడ్పిటిసి టి రమేష్, బాల గురవయ్య, ఆనందయ్యలు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల ఆటం కలిగిస్తే చర్యలు తప్పవు : డిఎస్పీ



గూడూరు, జులై 27 ప్రభాతవార్త: నియోజక వర్గంలో ఎక్కడైనా శాంతి భద్రతల విషయంలో ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎస్పీ గీతా కుమారి ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట రౌడీ షీటర్లకు తెలియ జేశారు. అదేవిధంగా శాంతియుత వాతా వరణంలో తమ తప్పులు తెలుసుకొని ప్రజలతో మమేకమై సంతోషమైన వాతా వరణంలో జీవించాలన్నారు పూర్తి స్థాయిలో రౌడీషీట్లకు కౌన్సిలింగ్ అందజేసారు. అదేవిధంగా రాణిపేట వీధుల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి ఎలాంటి పత్రాలు లేనటువంటి 18 ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకువచ్చారు. అదే విధంగా బయట అనుమానిత వ్యక్తులు మీ ఏరియాలో తిరుగుతున్నప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ గీతా కుమారి, సిఐలు శేఖర్ బాబు, కిషోర్ బాబు, మనోజ్ కుమార్, సురేష్ బాబుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలను పరామర్శించిన ఎమ్మెల్యే



కోట, జులై 27 ప్రభాతవార్త: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎస్సీ వసతిగృహం విద్యార్థినులను యూనిఫాం ధరించలేదని పిఇటి మాబాషా అలియాస్ సుభాన్ చితకబాదిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఎస్సీ వసతిగృహానికి చేరుకున్నారు. అప్పటికే బాలికల తల్లిదండ్రులతో నిండిపోయిన వసతిగృహంలో వివిధ పార్టీల నాయకులు పరామర్శలతో గందరగోళంగా ఉంది. విద్యార్థినుల తల్లిదండ్రులు ఈ సంఘటనపై ఎమ్మెల్యేకి కన్నీటి పర్యంతమై వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులంటే తనకు గౌరవమని, అయితే ఇలాంటి ఉపాధ్యాయుడు సమాజంలో పనికిరాడన్నారు. ఉపాధ్యాయ వృత్తికి కళంకం తీసుకొస్తున్నారని, ఇలాంటి వారి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సంఘటనపై తాను జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడానని చెప్పారు. ఆయన వెంట తహశీల్దార్ కె.జయజయరావు, టిడిపి నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, జలీల్ అహ్మద్, టిడిపి అధ్యక్షులు పలగాటి భాస్కర్‌రెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, పోలయ్య, ఎంపిటిసి సురేష్ తదితరులు ఉన్నారు.

## పిఇటి మాస్టర్‌ను విధుల నుంచి డిస్మిస్ చేయాలి



కోట, జులై 27 ప్రభాతవార్త: కోటలోని బాలికల హైస్కూల్ పిఇటి మాస్టర్ మాబాషాను విధుల నుంచి డిస్మిస్ చేయాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆశిత్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం నాయకుడు వంశీ, కోట మండల జాయింట్ సెక్రటరి పాముల సురేంద్రలు డిమాండ్ చేశారు. ఆదివారం వారు వసతిగృహాన్ని సందర్శించి గాయపడిన బాలికలను పరామర్శించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెచ్చేలా ప్రవర్తించిన పిఇటి మాబాషాను పూర్తిగా విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిన్నెలపూడి సర్పంచ్ కర్లపూడి పెంచలయ్య, కోట మండల బిసి సెల్ నాయకులు కోటేశ్వరరావు, వెంకీ, ప్రతాప్, హరికృష్ణ, శివశంకర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలను పరామర్శించిన బిజెపి నాయకులు

కోట, జులై 27 ప్రభాతవార్త: ఎస్సీ వసతిగృహం 10వ తరగతి విద్యార్థినులను చితకబాదిన ఘటనపై ఆదివారం రాష్ట్ర బిజెపి నాయకులు పనబాక కోటేశ్వరరావు, అంబరీష్, డాక్టర్ రమేష్, వెంకటేశ్వర్లు, బహుజన నాయకులు అరవ పార్వతయ్య, మీజూరు మాధవ్ విలేఖరులతో మాట్లాడారు. పిఇటి మాబాషాను వెంటనే డిస్మిస్ చేయాలని కోరారు.

## వాలీబాల్ టోర్నమెంట్‌లోవిద్యార్థులు ప్రతిభ



చిల్లకూరు, జులై 27 ప్రభాతవార్త: అండర్ 17 వాలీబాల్ టోర్నమెంట్‌లో మండలంలోని తూర్పు కనుపూరులోని నవనీతం ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 17 వాలీబాల్ టోర్నమెంట్ తెలంగాణ రాష్ట్రంలోని నాగర్‌గుల్‌లోని డిల్లీ పబ్లిక్ పాఠశాలలో ఈ నెల 24 నుండి 26వ తేది వరకు వాలీబాల్ పోటీలు నిర్వహిఒచారు. ఇందులో పాల్గొన క్రీడాకారిణిలు ఆంధ్రప్రదేశ్ తెలంగాణలోని సిబిఎస్‌ఈ పాఠశాల విద్యార్థినులు 73 జట్లు పాల్గొనగా ఈ విభాగంలో స్థానిక తూర్పు కనుపూరులోని నవనీత పబ్లిక్ స్కూల్ విద్యార్థులు విజయం సాధించారు. ఇందుకు సహాయ సహకారాలు అందించడమే కాకుండా పాఠశాల విద్యార్థినిలకు, అదే విధంగా టీమ్ కోచ్ కదండరామయ్యకి, టీమ్ మేనేజర్ అంజనా దేవికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పాఠశాల అడ్మిన్ ఆఫీసర్ సుమంత్ రెడ్డికి, యువ కిరణ్‌కి, తర్ఫీదు ఇస్తున్న వినయ్, శివ, కోటేశ్వర్ రావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే హెల్పింగ్ హాండ్స్ ఆశయం



చిల్లకూరు, జులై 27 ప్రభాతవార్త: పేదోడికి అండగా కేరాఫ్ అడ్రస్‌గా హెల్పింగ్ హాండ్స్ సంస్థ మారింది. చిల్లకూరు మండలం ఓడూరు గ్రామంలో పేద కుటుంబానికి పదివేల నగదు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డి.జె.అజయ్‌కుమార్ పాల్గొన్నారు. వెంటనే ఆర్థికంగా ఆదుకున్న హెల్పింగ్ హాండ్స్ టీంకు శీనయ్య కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడ పేదలు ఉన్న మేము సహాయం చేస్తామని హెల్పింగ్ హాండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ జోనన్ బెనాయ్ అంటున్నారు. చిల్లకూరు మండలం కోడూరు గ్రామంలో అంగ వైకల్యంతో బల్లి సుధాకర్‌కు వారి పిల్లల ఆరోగ్య మందుల నిమిత్తం ఆర్థికంగా ఇబ్బంది పడతుండగా మేమున్నాము అంటూ వారి కుటుంబానికి అండగా పదివేల నగదు హెల్పింగ్ హాండ్స్ టీం అందించారు.

## పిఇటి మాబాషా సస్పెన్షన్!

కోట, జులై 27 ప్రభాతవార్త: కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులను చితకబాదిన సంఘటనపై పిఇటి మాస్టర్ మాబాషాను జిల్లా విద్యాశాఖ అధికారి కుమార్ సస్పెండ్ చేశారు. అదే క్రమంలో ఆ సమాచారాన్ని గోప్యంగా ఉంచినందుకు ప్రధానోపాధ్యాయురాలు భారతికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంఇఒ మస్తానయ్య తెలిపారు.

**పోలీసుల అదుపులో పిఇటి మాబాషా :**

కోట ఎస్సీ వసతిగృహం విద్యార్థినులను చితకబాదిన బాలికల హైస్కూల్ పిఇటి మాస్టర్ మాబాషాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ మేరకు గూడూరు డిఎస్పీ గీతాకుమారి ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## చిరస్మరణీయుడు అబ్దుల్‌కలాం



సూళ్లూరుపేట, జులై 27 ప్రభాతవార్త: మాజీ రాష్ట్రపతి, అణుపితామహుడు ఏపీజే అబ్దుల్‌కలాం చిస్మరణీయుడని, ఆయన ఇచ్చిన స్ఫూర్తితో భావితరాలు ముందుకు వెళ్లాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం స్థానిక బాలుర హైస్కూల్లో నిర్వహిఒచిన ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని అబ్దుల్ కలాం కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎంఇఓ కాపులూరు శ్రీనివాసులురెడ్డి, పూర్వపు విద్యార్థుల సంఘం నుంచి డాక్టర్ కెఎస్ సాయిరాం, ఉస్మాన్‌బాషా, శ్యామ్, శ్రీకుమార్‌రెడ్డి, వీరరాఘవులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆర్టీసీ ఎండి తిరుమలరావు రాక



వెంకటగిరి, జులై 27 ప్రభాతవార్త: ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సోమవారం వెంకటగిరి ఆర్టీసీ డిపోను తనిఖీ చేయనున్నట్లు డిపో మేనేజర్ వెంకటకృష్ణయ్య తెలిపారు. ఆర్టీసీ డిపో, బస్టాండ్లను ఎండి పరిశీలిస్తారని తెలిపారు. ఎండి రాక సందర్భంగా బస్టాండ్ రంగులు వేసి తీర్చిదిద్దుతున్నారు.

## పాపారెడ్డికి జిల్లా అదనపు బాధ్యతలు



వాకాడు, జులై 27 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా, బిజెపి ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తంరెడ్డికి తిరుపతి జిల్లా అదనపు బాధ్యతలను బిజెపి అధిష్టానం అప్పగించిందని పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా బిజెపి కార్యవర్గ మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాను ఆర్‌ఎస్‌ఎస్‌లో పని చేశానని, ఆ క్రమశిక్షణతోనే తనకు బిజెపి వాకాడు మండలం అధ్యక్షుడిగా కొనసాగానన్నారు. పాపారెడ్డికి శ్రేయోభిలాషులు, అభిమానులు, కూటమి నాయకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## రోటరీ క్లబ్ కోట టౌన్ అధ్యక్షుడిగా జలీల్

కోట, జులై 27 ప్రభాతవార్త: రోటరీ క్లబ్ కోట టౌన్ అధ్యక్షుడిగా షేక్ జలీల్ అహ్మద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కోటలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో రోటరీ క్లబ్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఏకగ్రీవంగా టౌన్ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా జలీల్ అహ్మద్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా వంశీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ అధ్యక్షులు నెల్లూరు మోహన్‌రెడ్డి, పెల్లేటి గోపాల్‌రెడ్డి, జెమ్మి ప్రసాద్, కిషోర్, జిల్లా మాజీ గవర్నర్ మునిగిరీష్, నాయుడుపేట, గూడూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



బాలాయపల్లి. జులై 27 ప్రభాతవార్త: మండలంలోని రామాపురం క్రాస్ రోడ్ వద్ద అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న బండి నారయ్యను అరెస్టు చేసినట్లు ఎస్సై కామినేని గోపి తెలిపారు. నారయ్య బెల్టు షాప్ నిర్వహించేందుకు మద్యం బాటిళ్లను తరలిస్తున్నట్లు చెప్పారు. బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచండి : ఎంపిపి




నాయుడుపేట, జులై 27 ప్రభాతవార్త: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచే విధంగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి తెలిపారు. ఆమె ఆధ్వర్యంలో ఆదివారం అధికారులు నాయుడుపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లడుతూ వాతావరణంలో మార్పులు, అల్పపీడనం ప్రభావంతో గతవారం రోజులనుండి కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో మురికినీరు నిల్వ చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టి పారిశుధ్యం మెరుగుపరచాలని తెలియజేశారు. వర్షాలు ప్రభావంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండ వైద్యాధికారులు గ్రామాల్లో పర్యటించి జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి వంటి వ్యాదుల పట్ల ప్రజలు తీసుకోవాల్సి జాగ్రత్తలపై పలుసూచనలు,సలహాలు తెలియ చేయాలన్నారు. వ్యవసాయశాఖ అధికారి గణేష్ మాట్లడుతూ మండలానికి రెండు డ్రోన్లు మంజూరైయ్యాయని తెలిపారు. వాటిని ఆగష్టు 2వ తేదిన పుదూరులో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా ప్రారంబించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎంపిడిఓ సురేష్‌బాబు మాట్లడుతూ గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందించే విధంగా అధికారులు చూడాలని తెలిపారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ రాజేంద్ర, జడ్పిటిసి కట్టా జ్యోతి,పశుసంవర్దకశాఖ ఎడి గోవర్దన్,ఎంపిటిసి సభ్యులు పరసా వెంకటరత్నం, సర్పంచులు,పంచాయతీ కార్యదర్శిలు తదితర శాఖల అధికారులు పాల్గోన్నారు.

## పాత ఇనుప సామాన్లు దుకాణాల్లో పోలీసుల తనిఖీలు



నాయుడుపేట, జులై 27 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని పాతఇనుప సామాన్లు దుకాణాలపై డిఎస్‌పి చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా డిఎస్‌పి చెంచుబాబు మాట్లడుతూ డివిజన్ పరిదిలో మోటార్‌సైకిళ్ళు, వ్యవసాయ మోటార్లు చోరీలకు గురి కావడంతో పాత ఇనుప సామాన్లు దుకాణాలను తనిఖీలు చేయడం జరిగిందన్నారు.అనంతరం పట్టణం లోని పలు దుకాణాల్లో స్టాకరి జిష్టర్లును క్షుణంగా పరిశీలించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో సిఐ బాబి, సంఘమేశ్వరావు, నాయుడుపేట, దొరవారిసత్రం, పెళ్ళకూరు, ఓజిలి మండలాల ఎస్సైలు శ్రీకాంత్, అజయ్‌కుమార్, నాగరాజు, ఆదిలక్ష్మి, పోలీసు సిబ్బంది పాల్గోన్నారు.

## మెరైన్ స్టేషన్‌ను సందర్శించిన డిఐజి



వాకాడు, జులై 27 ప్రభాతవార్త: మండల పరిధిలోని దుగరాజపట్నం గ్రామంలో ఉన్న మెరైన్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం మెరైన్ డిఐజి గోపీనాథ్ జెట్టి సందర్శించారు. మెరైన్ పోలీస్ స్టేషన్ సిఐ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్సైలు అంజిరెడ్డి, శివ సౌమ్య, సిబ్బంది డిఐజిని గౌరవ వందనంతో స్వాగతం పలికారు. డిఐజి గోపీనాథ్ జెట్టి స్టేషన్లోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ సముద్రంలోని కొత్త వ్యక్తులు కనిపించిన విచారించి అవసరమైతే చర్యలు తీసుకోవాల న్నారు. డీఐజీ వెంట సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్సైలు శివ సౌమ్య, అంజిరెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మాజీ ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం



రేణిగుంట జులై 27 ప్రభాతవార్త : భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు రేణిగుంట రైల్వే స్టేషన్లో ఆదివారం ఉదయం ఘన స్వాగతం లభించింది. చెన్నై నుండి రేణిగుంట చేరుకున్న ఆయనకు రైల్వే స్టేషన్లో రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్, టిటిడి బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, రేణిగుంట మండల బిజెపి అధ్యక్షుడు పూజారి ప్రేమ్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు సతీష్, మధు తదితర బిజెపి శ్రేణులతో పాటు ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అర్బన్ సీఐ జయచంద్ర, అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్‌రెడ్డి తమ సిబ్బందితో భద్రత చర్యలు చేపట్టారు.

## ప్రణాళికాబద్ధంగా ప్రయాణం చేస్తే సురక్షితంగా గమ్యస్థానం

### - 'స్లో మోటర్ సైకిల్ రైడింగ్' విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎస్పీ మణికంఠ చందోలు



చిత్తూరు, జులై 27 ప్రభాతవార్త: ద్విచక్ర వాహనదారులు ప్రణాళికబద్ధంగా ప్రయాణం చేస్తే సురక్షితంగా గమ్మస్థానం చేరుకుంటారని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. చిత్తూరు ఏఆర్ పోలీసు మైదానంలో ఎస్పీ మణికంఠ చందోలు, విజయం విద్యాసంస్థల ఛైర్మన్ తోజోమూరిలు ఆదివారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్లో మోటర్ సైకిల్ రైడింగ్ విజేతలకు బహుమతులు అందజేశారు. జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ మన దేశంలో ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాలతో 1.60 లక్షల మంది మృతి చెందుతున్నారని, 4 లక్షల మందికిపైగా క్షతగాత్రులు అవుతున్నారన్నారు. వాహనాలను అతివేగంగా నడుపడం, ట్రాఫిక్ నియమాలు పాటించకుండా పోవడంతోనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. జిల్లాలో ప్రతి ఏడాది 360 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతుండగా, 1,100 మందికి పైగా తీవ్ర గాయాలు పాలవుతున్నారన్నారు. చిత్తూరు నగర పరిధిలో ఇటీవల జరిగిన 10 రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతోనే మృతి చెందారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్లో మోటర్ సైకిల్ రైడింగ్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్న వారికి ఎస్పీ మణికంఠ చందోలు, విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తిలు బహుమతులు ప్రధానం చేశారు. ప్రథమ స్థానం కైవసం చేసుకున్న చిత్తూరు వరదరాజులపల్లికి చెందిన పివి అరుణ్ కుమార్‌కు రూ.20 వేలు, ద్వితీయ స్థానం దక్కించుకున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ పిసి యోగవేంద్రన్‌కు రూ.15 వేలు, తృతీయ బహుమతి సాధించిన తేనెబండకు చెందిన సీనియర్ ప్రొఫెసర్ పవన్‌కుమార్‌కు రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు డిఎస్పీ సాయినాథ్, ఏఆర్ డిఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాషాలు, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు, వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, ఆర్ఐలు సుధాకర్, చంద్రశేఖర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణముఖి నదిపై వంతెన నిర్మించి ఆదుకోండి



శ్రీకాళహస్తిరూరల్,జులై 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తున్న స్వర్ణముఖి నదిపై ఎంతో కాలంగా సమస్యగా మారిన కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మించి రాకపోకలకు అదుకోవాలని ఆదివారం జరిగిన సుపరిపాలనలో ఏడాది తొలి అడుగు కార్యక్రమంలో గ్రామ ప్రజలు కోరారు.ఈ సమస్యను ఇటీవల శ్రీకాళహస్తిలో పర్యటించిన రహదారులు, భవనాలశాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డిని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అభ్యర్థించారని పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు వివరించారు. వర్షాకాలంలో సువర్ణ ముఖి నది ఉధృతంగా ప్రవహిస్తుందని అప్పుడు ఒడ్డున ఉన్న గోవిందవరం ప్రజలు గుండెలు అరచేతిలో పెట్టుకొని గడపాల్సి వస్తుందని ప్రజలు మొరబెట్టుకున్నారు. ఈ కార్యక్రమాల్లో నాగరాజు నాయుడుతో పాటు పేరం ధనంజయులు నాయుడు,రాష్ట్ర తెలుగురైతు విభాగం కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి, పొన్నారావు, మోహన్‌నాయుడు,శివశంకర్‌రెడ్డి,బాబు నాయుడు, చిరంజీవులు నాయుడు, సూరి నాయుడు, సుధాకర్‌రెడ్డి, భూపతినాయుడు, భాస్కర్, కృష్ణప్ప మొదటి, సీతాపతి ఆచారి, హేమాక్షి, హరినాయుడు, కృష్ణవేణి, హంస, గౌరి,సురేష్,రాఘవేంద్ర, డాక్టర్‌మునెయ్య, రమేష్, కృష్ణ, అంకయ్యలు పాల్గొన్నారు.

### ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో...

## మోకాళ్ళ మార్పిడి రోగులకు ప్రత్యేక క్రీడలు



తిరుపతి హెల్త్, జులై 27 ప్రభాతవార్త : ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి తరపున గత ఏడాది మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స చేసుకున్న రోగుల కోసం ప్రత్యేకంగా స్పోర్ట్స్ మీట్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఆర్థో పెడిక్ డాక్టర్ వి. సునందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ స్పోర్ట్స్ మీట్ ద్వారా మోకాళ్ళ శస్త్ర చికిత్సపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగుతాయన్నారు. శస్త్ర చికిత్స తర్వాత రోజూ చిన్న చిన్న వ్యాయామాలు చేస్తే మోకాళ్ళు మార్పిడి ఎక్కువ కాలం భాగానే పనిచేస్తుందని తెలిపారు. ముఖ్య అతిథి ఐఎంఏ తిరుపతి అధ్యక్షులు డాక్టర్ రామ్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా రోగులకు ధైర్యం ఇస్తాయన్నారు. ప్రజల్లో మోకాళ్ళ ఆరోగ్యం గురించి సరైన అవగాహన రావాలంటే ఇలాంటి ఈవెంట్లు తప్పనిసరి అన్నారు. ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి సీఈవో డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ ప్రతి రోగికి మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడంతో పాటు శస్త్రచికిత్స తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాయామాల గురించి కూడా రోగులకు వివరించడం ఆస్పత్రి ప్రత్యేకత అన్నారు. ఈ మీట్ ద్వారా తమ ఆర్థోపెడిక్ విభాగంలో రోగులకు పూర్తి సహకారం, మార్గనిర్దేశనం అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా శస్త్రచికిత్స రోగులకు క్రీడా పోటీలు నిర్వహించి డాక్టర్ల బృందం బహుమతులు అందజేశారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను రద్దు చేయకుంటే ఉద్యమాలు : సిపిఐ




శ్రీకాళహస్తిరూరల్, జులై 27 ప్రభాతవార్త: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు తప్పవని ఆదివారం జరిగిన ఏర్పేడు సిపిఐ మహా సభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.హరి నాథ్‌రెడ్డి పిలుపు నిచ్చారు. సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఊరూ వాడ సంబరాలు జరుపుకోవాలని కేంద్ర కమిటి పిలుపు నిచ్చిందన్నారు. ప్రతి గ్రామంలోనూ వంద జెండాలు,వంద చెట్లను నాటాలని తీర్మానించారన్నారు. సిపిఐ ఆది నుంచి పేద ప్రజలకు అండగా శ్రామికుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలతో ప్రభుత్వాల కనువిప్పు కల్పిస్తున్నట్లు హరినాథ్‌రెడ్డి వివరించారు. సమావేశానికి సర్దార్‌శివ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హరినాథ్‌రెడ్డి హాజరయ్యారు.వందేళ్ళ ఉద్యమాల్లో ముఖ్యంగా దున్నేవానిదే భూమి కోసం భుక్తి కోసం పోరాడిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. ఎన్నికల్లో అధికారం కోసం సాధ్యం కాని హామీలను ఇస్తూ భారత దేశాన్ని దివాలా దిశగా బిజెపి పరిపాలిస్తుందన్నారు. నేడు 164సీట్లతో పరిపాలిస్తున్న కూటమి ప్రభుత్వం అధికారం కోసం పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ళ స్థలాలంటూ పేదలకు ఆశ చూపారన్నారు. కానీ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, చంద్రశేఖర్‌రెడ్డి మండల నాయకులు వైయస్ మణి, మించల శివకుమార్, గోపి,ఎఐటియుసి అధ్యక్షులు మల్లికార్జున్ కార్తీక్, రమేస్‌లు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీద్రౌపతి సమేత ధర్మరాజుల కళ్యాణం



తిరుపతిరూరల్, జులై 27 ప్రభాతవార్త: దుర్గసముద్రంలో శ్రీద్రౌపతి సమేత ధర్మరాజుల కళ్యాణం ఆదివారం కన్నులపండవుగా జరిగింది. ద్రౌపతి కళ్యాణాన్ని దుర్గసముద్రం ప్రజలే కాకుండా పరిసర ప్రాంత గ్రామస్తులు పెద్దఎత్తున చేరుకుని, కన్నులవిందుగా తిలకించారు. తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో శ్రీద్రౌపతి సమేత ధర్మాజుల మహాభారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్న విషయం తెల్సిందే. కళ్యాణాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం మూలవిరాట్ స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా అభిశేకం చేసారు. మధ్యాహ్నం భాగవతారని రాణిరెడ్డి కథలో ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి హరికథను సవివరంగా భక్తులకు వివరించారు. సాయంత్రం 6గంటలకు ఉత్సవ మూర్తులను ఆలయ ఆవరణలోని కళ్యాణ వేదిక మండపానికి వేంచేసారు. ఉభయదారులు ఆదేం వెంకటరమణారెడ్డి ఆయన సతీమణి భువనేశ్వరి ఆలయ అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి, శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛరణ చేసారు. మంగళవాయిద్యాలు వాయిస్తూ ద్రౌపతి అమ్మవారికి మంగళ సూత్రాన్ని ధరింపజేసారు. వేదపండితులు ద్రౌపతి సమేత ధర్మరాజుల కళ్యాణ విశిష్టత గురించి భక్తులకు, ప్రజలకు వివరించారు. అనంతరం స్వామి అమ్మవార్లతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు, ప్రజలకు అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయధర్మకర్త, గ్రామ సర్పంచ్ మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి, కమిటీ సభ్యులు నాదమునిరెడ్డి, రమేష్‌రెడ్డి, జ్యోతిరెడ్డి పెద్దఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు గోల్డ్ మెడల్స్

తిరుపతి క్రీడ, జులై 27 ప్రభాతవార్త: ఉమ్మడి చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి పోటీలలో తిరుపతి శివ జ్యోతి నగర్‌లో ఉన్న శ్రీ ద్రోణాచార్య బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులకు అండర్ 17 బాలికల డబుల్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. ఎం.యోషిత, బి.శాన్వి అండర్ 15 బాలుర విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన రోహిత్ బాబు ఈ బ్యాడ్మింటన్ క్రీడాకారులను శ్రీ ద్రోణాచార్య బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకులు, కోచ్ బి.కృష్ణయ్య ప్రశంసించి మెడల్స్ మెమొంటోలతో సత్కరించారు. క్రీడాకారులను నగదుతో ప్రోత్సహించారు. ఇందులో క్రీడాకారుల తల్లిదండ్రులు , క్రీడాకారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన వీడ్కోలు



రేణిగుంట జులై 27 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కు రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు లభించింది. శ్రీవారి దర్శనానంతరం తిరుమల నుండి రేణిగుంట విమానాశ్రయం రోడ్డు మార్గంలో ప్రత్యేక భద్రత నడుమ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, తిరుపతి ఆర్డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి రేణిగుంట శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

## శ్రీవారి సేవలో కింగ్‌డమ్ చిత్రబృందం



తిరుమల,జులై27ప్రభాతవార్తప్రతినిధి: కింగ్‌డమ్ చిత్రబృందం ఆదివారం ఉదయం విఐపి బ్రేక్ లో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల వీరిని చూడటానికి అభిమానులు ఉత్సాహం చూపారు.